క్లుప్తంగా

గ్రామ దేవతలకు బోనాలు



రామచంద్రునిపేట(జగ్గయ్యపేట):వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుతూ గ్రామ దేవతలకు సోమవారం గ్రామ మహిళలు బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలతో గ్రామంలో ఊరేగించి గ్రామ దేవతలకు సమర్పించారు. ముందుగా గ్రామంలోని నాభిశిలకు జలబిందెలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ గ్రామ దేవతలకు బోనాలు సమర్పించినట్లు సర్పంచ్ మద్దుల రామకృష్ణ తెలిపారు.

గోవుల సంరక్షణకు విరాళం



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు సోమవారం మండలంలోని నవాబుపేట గ్రామం వద్ద ఉన్న వీఎస్ఈ ఎకో బ్లాక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌వారు రూ.36,500 విరాళాన్ని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మర్రెబోయిన వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవాలి



కంచికచర్ల: ఓటరు లిస్టులో మార్పులు చేర్పులు ఉంటే సరిచేయాలని తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. బూత్ లెవెల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఓటర్ లిస్టులో ఉన్న మార్పులు చేర్పులు సరిచేసుకునే వెసులుబాటు కల్పించటం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో బీఎల్‌ఓలు తప్పనిసరిగా ఓటర్ల జాబితాను పరిశీలించి తప్పొప్పులను సరిచేయాలని కోరారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ నాగులమీరా, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎండీడీటీఐ ప్రెసిడెంట్ డాక్టర్ జయమోహన్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యాన కృష్ణా కెనాల్‌లోని మల్టీ డిసిప్లినరీ డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎండీడీటీఐ)లో ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టారు. జయమోహన్ సభ్యులతో కలిసి ఎండీడీటీఐ పరిసరాలలో పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పాటు సమాజానికి అవసరమైన పోషకాహారం అందించడానికి మామిడి, జామ, అరటి, దానిమ్మ పండ్ల మొక్కలు నాటాకరాంరకె. మొక్కలు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ, నేల కోత, సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

నందిగామ: పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... నందిగామ మండలం పల్లగిరి గ్రామానికి చెందిన వేల్పుల ఆదామ్ (50) పక్షవాతంతో కొంతకాలంగా మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన ఆదామ్ సోమవారం ఉదయం పురుగుల మందు తాగాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఏఎస్ఐ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మైలవరంలో ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

మైలవరం: వ్యవసాయ మార్కెట్ యార్డులోని రేషన్ బియ్యం మెయిన్ లిఫ్టింగ్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ అదితిసింగ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అదితి సింగ్ రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆమె వెంట మైలవరం తహసీల్దారు శ్రీనివాస్, సివిల్ సప్లయిస్ డీటీ మాధవి ఉన్నారు.

గడప వద్దకే సంక్షేమం.. సేవలు..

దరఖాస్తు చేయగానే ఇంటి స్థలం



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు తిరుపతమ్మ. మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన వ్యక్తి. భర్తతో సహా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇంటి స్థలం కోసం గతంలో అనేక మార్లు దరఖాస్తు చేసుకొంది. కానీ ప్రయోజనం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ ద్వారా ఇంటి స్థలం మంజూరు కోసం తిరుపతమ్మ దరఖాస్తు చేసుకొంది. అన్ని అర్హతలు ఉండటంతో ఆమెకు స్థలం మంజూరయింది. ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఇంటి స్థలం వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తోంది. జగనన్న పాలనలో సొంతింటి కల నెరవేరిందని తెలిపింది.

రేషన్‌కార్డు వచ్చింది




ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు చేని గోపి. చిన్నపాటి ఉద్యోగం చేస్తుంటాడు. ఇప్పటివరకు ఈయనకు రేషన్ కార్డు లేదు. దీంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఏవీ కూడా పొందలేకపోయాడు. అర్హత ఉన్నా రేషన్ కార్డు లేకపోవడంతో పథకాల ద్వారా లబ్ధి కలగలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డు కోసం సచివాలయంలో దరఖాస్తు చేశాడు. అర్హత ఉండటంతో వెంటనే రేషన్‌కార్డు మంజూరు చేశారు. కార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని గోపి చెప్పాడు.

- సచివాలయాల ద్వారా విస్తృతంగా సేవలు
- సులభతరంగా సమస్యలు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పెనుగంచిప్రోలు: సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు గడప వద్దకే అందుతున్నాయి. ప్రతి 50 ఇళ్లకు నియమించిన వలంటీర్ల సహకారంతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది వలంటీర్ల సహకారంతో క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, పథకాలు అందజేసే వరకు బాధ్యతలు తీసుకుంటున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరు నష్టపోకుండా పారదర్శకమైన సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.



స్పందన ద్వారా సమస్యల పరిష్కారం...

సచివాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలపై వినతులు స్వీకరిస్తున్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నమోదు చేసి వాటిని పరిష్కరిస్తున్నారు. సమస్యల పరిష్కారాన్ని యాప్‌లో చూపిస్తున్నారు. సచివాలయాల పరిధిలో పరిష్కరించలేని వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు కావాలంటే నాయకులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేకుండా, అవినీతి అనేది లేకుండా ప్రజలకు సేవలు అందుతున్నాయి.

పారదర్శకంగా సేవలు



సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందుతున్నాయి. ఎటువంటి అవినీతి లేకుండా ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రభుత్వ పథకాలు, సేవలు అందిస్తున్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి సుమారుగా 41 వేల మంది లబ్ధిదారులు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందారు.

కన్నమాల శామ్యూల్, సచివాలయాల మండల కన్వీనర్, పెనుగంచిప్రోలు

నాలుగేళ్ల కాలంలో మండలంలో ప్రభుత్వ పథకాలు పొందిన వారి వివరాలు..

పథకం	లబ్ధిదారులు
వైఎస్సార్ చేయూత	2,723
వైఎస్సార్ ఆసరా	11,207
కాపు నేస్తం	297
వైఎస్సార్ పింఛను కానుక	7,709
ఈబీసీ నేస్తం	890
అమ్మ ఒడి	4,316
జగనన్న విద్యా దీవెన	1025
జగనన్న వసతి దీవెన	970
వైఎస్సార్ బీమా	105
వాహనమిత్ర	281
చేదోడు	270
హౌసింగ్	1594
జగనన్న తోడు	430
కల్యాణమస్తు	16
ఆరోగ్యశ్రీ	231
రైతు భరోసా	6,369
క్రాప్ ఇన్సూరెన్స్	2,956

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

పెనుగంచిప్రోలు:మండలంలోని శివాపురం, వెంకటాపురం, తోటచర్ల గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పాల్గొనాలని కోరారు.

జగ్గయ్యపేట:మండలంలోని తక్కెళ్లపాడు, ముక్త్యాల గ్రామాలల్లో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ సోమవారం తెలిపారు. రెండు గ్రామాలలో ఎంపీడీవో, డెప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో క్యాంపులు జరుగుతాయన్నారు. క్యాంపులో పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

కంచికచర్ల :మండలంలోని కంచికచర్ల-3, పెండ్యాల-2 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష శిబిరాలు మంగళవారం జరుగనున్నాయని ఎంపీడీఓ కె.బాలశంకరరావు సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొని ప్రజల సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు.

జగ్గయ్యపేట అర్బన్:జగనన్న సురక్ష కార్యక్రమాలు పట్టణంలో మంగళవారం రెండు సచివాలయాల్లో జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు మార్కండేయ బజారు, ఎర్రయ్య గారి ఇంటి వద్ద 7 వ సచివాలయం, ఉదయం 10 గంటలకు తొర్రగుంటపాలెంలో 15 వ సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు జరుగుతుందని తెలిపారు. ఈ క్యాంపుల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొంటారని తెలిపారు.

నందిగామ:పట్టణ పరిధిలోని 7 వ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పల్లగిరి గ్రామం లో సచివాలయం వద్ద, కేతవీరునిపాడు గ్రామంలోని సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే స్పందన

నందిగామ:సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు మండలాల నుంచి మొత్తం పది అర్జీలు అందాయని, వాటిలో ఎనిమిది రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి కాగా రెండు పోలీసు శాఖకు సంబంధించినవని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేస్తామని తెలిపారు. ప్రతి అర్జీకి సంబంధించి సమస్య పరిష్కారమయ్యేంతవరకు మానిటరింగ్ జరుగుతుందన్నారు. సమస్యలు సత్వరమే పరిష్కారం కావాలంటే స్పందన ఒక్కటే మార్గమన్నారు. నిజమైన బాధితులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన నిర్వహిస్తోందన్నారు.



స్పందన అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో

నాగరత్నం మృతి జీర్ణించుకోలేనిది

నివాళులర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ..

నందిగామ టౌన్:ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండటమే కాకుండా అతి సామాన్య జీవనం గడుపుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తపనపడే నాగరత్నం అనారోగ్యంతో మృతి చెందటం జీర్ణించుకోలేనిదని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నం మృతదేహాన్ని సోమవారం ఆయన సందర్శించి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మృతదేహాన్ని చూసి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ పదేళ్లుగా తమతో చేసిన రాజకీయ ప్రయాణంలో ఎన్నో అనుబంధాలు పెనవేసుకున్నాయని తెలిపారు. తనతో పాటు సోదరుడు శాసనమండలి సభ్యుడు డాక్టర్ అరుణకుమార్‌లు మాతృ సమానులుగా భావించేవారమని చెప్పారు. బతికినంత కాలం నిరాడంబర జీవితం గడిపారని తెలిపారు.

మచ్చలేని పని తీరుతో మంచి పేరు..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలిగా మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వహిస్తూ మచ్చలేని పని తీరుతో ప్రజా మన్ననలు పొందారని జగన్‌మోహనరావు తెలిపారు. వార్డులో సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసేవారని గుర్తు చేసుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ తమ బిడ్డలా ఆప్యాయంగా పలకరించే వారని కొనియాడారు. అటువంటి నాగరత్నం నేడు తిరిగిరాని లోకాలకు వెళ్లి ప్రతి ఒక్కరిని అనాథలను చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. నాగరత్నం మృతి పార్టీకి, తమకు తీరని లోటని పేర్కొన్నారు. ఆమె లేని లోటు తీర్చలేనిదని చెప్పారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌లు శవపేటికను మోశారు. కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనల అనంతరం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, బెజవాడ రాజశేఖర్, పాకాలపాటి కిరణ్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జగ్గయ్యపేట అర్బన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ మాజీ మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ శివశంకర్ అన్నారు. లయన్స్ కమ్యూనిటీ హాల్లో 2023-24 లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. లయన్స్ పూర్వపు గవర్నర్ కంకణాల శ్రీనివాసరావు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు డాక్టర్ రాజా కేశవప్రసాద్, కార్యదర్శి పి.కృష్ణమూర్తి, కోశాధికారి కె.కరుణాకర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ మొదటి గవర్నర్ గద్దె శేషగిరి, రెండవ గవర్నర్ ఆంజనేయులు ప్రమాణ స్వీకారం చేయించారు. కేసీఎల్ వైస్ ప్రెసిడెంట్ వి.మధుసూదనరావు, జిల్లా ఉప కోశాధికారి ఖాసిం సైదా, రీజియన్ చైర్మన్ మోహన్‌బాబు,జోన్ చైర్మన్ నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మోహిద్దీన్, బదరీనారాయణ, జాన్‌పాల్, రవికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్ నూతన కార్యవర్గం

మహిళల స్వయం ఉపాధికి సహకరించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ (పీఎంఎఫ్ఎంఈ) పథకం ద్వారా విశ్వబ్రాహ్మణ మహిళలు ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్ల ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రొసెసింగ్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్. శ్రీధర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్స్ అన్ని మండలాల్లో అందుబాటులో ఉన్నారని, వారిని సంప్రదిస్తే తగిన సహాయ సహకారాలను అందిస్తారని చెప్పారు. పూర్తి ఉచితంగా ప్రొసెస్ చేసే ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతం బ్యాంక్ రుణ సౌకర్యం ఉందని, అందులో 35 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సీఈఓ శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న శ్రీకాంత్

స్పందనకు ఆరు అర్జీలు

వీరులపాడు: అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. వీరులపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరు అర్జీలు అందాయన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు.

స్పందనలో మూడు అర్జీలు

కంచికచర్ల : స్పందనలో మూడు అర్జీలు అందాయని డెప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్ మీరా తెలిపారు. డ్రెయినేజీలో పూడిక పనులు చేపట్టాలని, వీలునామా తమకు తెలియకుండా ఇతరులు రాయించుకున్నారని సమస్య పరిష్కరించాలని ఒక అర్జీ వచ్చిందన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖ అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరిస్తామని డీటీ అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యరేఖ, ఏపీఎం కోట భాస్కరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని వినతి

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని విలియంపేట సమీపంలోని ముక్త్యాల రోడ్‌లో ఉన్న తాత్కాలిక మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలం సర్వే నెం 389/2ఎ నుండి 390/2 లో ఉన్న 11.35 ఎకరాల స్థలంలోకి తరలించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పచ్చిపాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ పేరున ఉన్న వినతిపత్రాన్ని మున్సిపల్ మేనేజర్ నాగకుమారికి అందజేశారు. డంపింగ్ యార్డు ప్రధాన రహదారికి అత్యంత సమీపంలో ఉండటం వలన పేట పట్టణానికి వివిధ గ్రామాల నుంచి, తెలంగాణ నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. వేదాద్రి దేవస్థానం, కోటి లింగాల క్షేత్రాలకు వెళ్లే భక్తులు కూడా డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు పసుపులేటి శ్రీకృష్ణ, వర్మాజీ, మేడూరు వెంకట్రావు, సైదాబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన యువకుడిపై కేసు నమోదు

పెనుగంచిప్రోలు: బాలికను వేధించిన కేసులో యువకుడిపై కేసు నమోదు అయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొణకంచి గ్రామంలో బాలిక తల్లి కొంతకాలం క్రితం అనారోగ్యంతో చనిపోయింది. తండ్రి దూరంగా ఉండటంతో అమ్మమ్మ ఇంట్లో సోదరుడితో పాటు ఉంటోంది. ఈ క్రమంలో గ్రామానికే చెందిన జి.క్రాంతికుమార్ బాలికతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండేవాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాలికను హెచ్చరించారు. కొంతకాలం బాగానే ఉంది. తిరిగి క్రాంతికుమార్ ఫోన్ మాట్లాడాలని వేధిస్తుండటంతో ఈ నెల 15న రాత్రి ఇంట్లో ఎలుకల కోసం ఉంచిన గుళికలు తిన్నది. ప్రస్తుతం బాలిక జగ్గయ్యపేట ఆసుపత్రిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాలిక సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

నందిగామ:బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందిగామలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుపై ఓ వ్యక్తి దాడి చేశాడు. న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా విధులు బహిష్కరించి నిరసన తెలిపినట్లు నందిగామ బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.ప్రకాష్ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కరరావు, ఆజాద్, పవన్ కుమార్, దివ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

మాచినేనిపాలెం(వత్సవాయి):జగనన్న సురక్ష కార్యక్రమం సమస్యల పరిష్కారానికి మార్గమని ఎంపీడీవో సీహెచ్ చెన్నారావు తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు సైతం పరిష్కరిస్తున్నామని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, అధికారులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 1200 ధ్రువీకరణపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి రాధాకుమారి, ధీరావతు రెడ్యానాయక్, డీటీ రవికుమార్, కార్యదర్శి భానునాయక్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న ఎంపీడీవో, సర్పంచులు

బీఎల్‌వోలకు అవగాహన సదస్సు

జగ్గయ్యపేటఅర్బన్:నియోజకవర్గానికి సంబంధించి రూరల్, అర్బన్ పోలింగ్ స్టేషన్ల బూత్ లెవెల్ ఆఫీసర్స్‌కు ఓటర్ల జాబితా పరిశీలన నిమిత్తం సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు, ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ యు.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి నియోజకవర్గంలో ప్రతి ఒక్క బీఎల్‌వో ఓటర్లకు సంబంధించి పోలింగ్ స్టేషన్లకు పరిశీలన నిమిత్తం వెళ్లాల్సి ఉందని తహసీల్దార్, కమిషనర్ తెలిపారు. దీనిపై బీఎల్‌వోలకు ఇంటింటి సర్వే, ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర విషయాలపై పూర్తి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏ విధమైన అవకతవకలకు తావు లేకుండా ప్రతి ఒక్క బీఎల్‌వో నిబద్ధతతో పనిచేయాలని పలు సూచనలు జారీ చేశారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యారావు, వేదికపై కమిషనర్ మల్లేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేటలో ఆర్.నారాయణమూర్తి సందడి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో సోమవారం ఆర్.నారాయణమూర్తి పర్యటించారు. సెప్టెంబర్ 2 వ తేదీన రిలీజ్ కానున్న యూనివర్సిటీ అనే చిత్రాన్ని ప్రతి విద్యార్థి తప్పక చూడాలని కళాశాలలను సందర్శించి విద్యార్థులకు తెలియజేసేందుకు జగ్గయ్యపేట వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థలో జరుగుతున్న దోపిడీ విధానాలు, పేపర్ లీకేజీలు వంటి ప్రధాన అంశాలపై చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలిపారు. సొంత వాహనం కూడా లేకుండా ఆయన బస్సు ప్రయాణంలో జగ్గయ్యపేటకు వచ్చి తిరగడంతో విద్యార్థులు, కళాశాలల అధ్యాపకులు ఆశ్చర్యంగా చూశారు.



పేటలో విద్యార్థులు, అధ్యాపకులతో సినీ హీరో ఆర్.నారాయణమూర్తి